కథా నిలయం
శ్రీకాకుళం

# భోగిపిడకలు

పెరటిగోడమీద ఎండుపిడకల్ని గోకి పిల్లలు దండ గుచ్చుతున్నారు. ఒక్కొక్క పిడకనీ గోకుతూవుంటే గోడ యొక్క వికృతరూపం బైటపడుతున్నాది. అసలే పాతగోడ, దానికితోడు పిడకలతోపాటు పెళ్లలూడొస్తున్నాయి. గోడని చూస్తూఉంటే నాబతుకు నాముందు నించున్నట్లనిపిస్తున్నది.

'ఎన్నరా' అని అడిగాను! 'ఇవి రెండువందల ఇరవై ఒకటి. అన్నీకలిపి మూడువందల చిల్లర' అని మా సందడిగా చెప్పేరు. మూడువందల పిడకలని మహదానందం పొందేను! నా ఉద్దేశం వాళ్ళకేం తెలుసు ?

బతికి చెడ్డ సంసారం, నలుగురు సంతానం; నలభై రూపాయల ఉద్యోగం; కరువుకాలం; ఇది నాస్థితి. రేపటినుంచి సంక్రాంతి పర్వదినాలు. పిల్లలకి బట్టలు కుట్టించలేదు. ఇంటికి వెల్ల వేయించలేను; నాలుగేళ్ళయి నెట్టుకొస్తున్నాను. షష్ఠిపూర్తి కోరుతున్న యిల్లు సున్నం వేయించని మూలాన చీకటి కొంపై మన దేశంలా మూలుగుతున్నాది.

ఈ కరువు కాలంలోకూడా పొదుపుగా, హాయిగా, బతికిందికి, మహారాజశ్రీ గవర్నమెంటువారు ప్రతిపత్రికలో ఇచ్చే సలహాలతో కలుపుకొని, అనేకమార్గాలు ఆలోచించి ఆచరణలో పెడుతున్నా. దాగకంత పెరడులోనే పాదులు

పెట్టి అధిక ఆహారోత్పత్తి చేస్తున్నాను; కూరల ఖర్చు తగ్గించి బతుకుతున్నాది.

నెల్లాళ్ళను ముందే నా పిల్లలు ఏ వీథిలో, ఏ ఆవు వెనక చూసినా వీళ్ళేఅయి పేడ తెచ్చి పిడకలు పెడుతున్నప్పుడే నాకు ఏడుపొచ్చింది, విలువైన చక్కటి ఎరువుని కాల్చివేయాలికదా అని. కొంతపేడ పాదులదగ్గర వేయండర్రా అంటే, ససేమిరా, పక్కింటివాళ్ళ పిల్లల్ని హెచ్చు పిడకలుపెట్టి ఓడించాలి అని, ఒక పిడక్కి సరిపోయినంత పేడయినా పాదులకి వెయ్యలేదు. ఒక్కిరోజుల్లో నా పెళ్ళాం పొయ్యలుకొట్టిందికి కొంచెంపేడపిసరు తెమ్మంటే ఒకళ్ళూ తెచ్చినపాపాన పోలేదు.

అసలు మనరైతుకే సత్తువైన ఎరువుని తగలెట్టేకంటు అంటే - డబ్బున్న మహారాజులకి కర్రబొగ్గూ, సరుగుడు కర్ర కాని, మాలాంటి పేదవాళ్ళకి పిడకలుకాక మరేమిటి అని అడుగుతారు. అలాంటప్పుడు లోకజ్ఞానంలేని నా పిల్లలకి వ్యవసాయ రహస్యంగాని, మన ఆర్థిక దుస్థితిగాని ఏం బోధ పడుతుంది?

భోగినాడుకూడా ఖర్చుతగ్గిస్తూ చక్కగా పండుగచేసు కొందికి నా కో మార్గం తోచి కుర్రాళ్ళనిపిలిచి 'రేపుపండుగ డబ్బులు కావాలా?' అని అడిగేను.

'మ రివ్వ వేమిటి?'

'అదికాదు. మామూలుకన్నా హెచ్చుకావాలా?'

పరమానందంతో పిల్లలు 'ఊ' అన్నారు.

'అయితే ఓపని చేయండి. రేపు ఈ పిడకల్ని మంటలో వేయకండి' అని నా షరతు చెప్పాను.

'అదేవిటి, భోగినాడు పిడకల్ని కాక మరేవిటి మంట వేసుకుంటారు?' అని ముక్తకంఠంతో ప్రశ్నించేరు.

'వినండి, ఈ పిడకల్ని మీఅమ్మ నీళ్ళపొయ్యిలో వేసి, రేపు మీకు తలంటుతుంది. మనకి రేపు నీళ్ళకి కాలే పుల్లు కర్రలు మిగులుతాయి. అంటే పదణాలన్నమాట. ఆ పదణాలు మీ నలుగురికీ ఇచ్చేస్తానన్నా.

పిల్లలకీ సలహా నచ్చలేదు. వాళ్ళకీ తెలుసు. నేను పదణాలిచ్చినా ఆ డబ్బు దాస్తానని తీసుకొని నా పెళ్ళాం ఇంటి ఖర్చు పెడుతుంది! ఇప్పటికి పిల్లలందరికీ కలిపి నా పెళ్ళాం ఇరవై రూపాయలు బాకీ. ఈఅప్పు ఈజన్మలో తీరదని వాళ్ళకి తెలిసిన సూర్యకాంతిలాంటి పరమసత్యం. అందుకే పదణాలు కాదు, పదిరూపాయలిస్తానన్నా పిడకలు మంటపెట్టక తప్పదని పట్టుపట్టేరు.

నా కాయశక్తులా నచ్చచెప్పేను, భోగిమంటే కావలసొస్తే పక్కవీధి శెట్టిగారింటిముందు మంటదగ్గరికి వెళ్ళమన్నా. ఈ కరువురోజుల్లో చాలా పేకేజీపెట్లు తగలెట్టి భోగిపండుగ చేసుకొంటారు. చక్క ఆనందించవచ్చు అని బోధ సల్పేను. ఊహూ, నా తీర్మానానికి ఏకగ్రీవంగా అసమ్మతి తెలియబర్చేరు. ఎవరింటిముందు వాళ్ళు మంటవేసుకోవాలట! భోగిమంట సంక్రాంతిపురుషుడికి హారతి కాదు కదా! మంట వెయ్యకపోతే మన పుట్టి మునిగిపోతుందని చెప్పేరు. వినలేదు.

చిన్నప్పట్నుంచీ, ఆర్థిక బాధ్యత పిల్లలబుర్రకెక్కించాలని నా సిద్ధాంతం. అందుకే ఈ మార్గం నచ్చచెప్పబోయేను. లాభంలేకపోయింది, మంటవేస్తే పిల్లగుండెకి ఏది ఆనందమో మర్చిపోయి ముప్ఫయి ఏళ్ళయింది!

పదణాల ఖర్చు తప్పకపోతే పది పరకలేనా మిగులుతాయని సంతోషిస్తూ. 'పోనీ మంట వేసుకుంటే వేసుకున్నారు గానీ, కచ్చికలు జాగ్రతచేయండి. పందుంపుల్లల ఖర్చేనా తగ్గుతుంది' అన్నా.